
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శుక్రవారం । 20 । అక్టోబర్ । 2023

I



డెల్టాకు నీరు విడుదల

ధవళేశ్వరం: గోదావరి డెల్టా కింద గురువారం తూర్పు డెల్టాకు 4900,మధ్య డెల్టాకు 2600,పశ్చిమ డెల్టాకు 7200క్యూసెక్కుల నీటిని వదిలారు.



అన్నదానానికి విరాళం

గోకవరం: స్థానిక వీరభద్రునిగద్దెలో నిర్వహించే అన్నదానానికి ఆధ్యాత్మిక వేత్త కంబాల శ్రీనివాస్‌రావు, పద్మావతీదేవి దంపతులు గురూరం రూ.1.10 లక్షలు వితరణ చేశారు.

కళాస్ఫూర్తికి పట్టాభిషేకం



వస్త్ర రంగంలో కొత్తపల్లి మండలంలోని చేనేత కార్మికులు చరిత్ర సృష్టిస్తున్నారు. అగ్గి పెట్టెలో పట్టేటంత చీరను నేసిన ఘనత ఉన్న ఉప్పాడ జాంధానీ చీరలు తయారు చేసే కార్మికుల కళా నైపుణానికి ప్రభుత్వం గుర్తింపు ఇచ్చింది.

- IIలో▸

న్యూస్‌రీల్

చండీ రూపిణి... ముక్తి ప్రదాయిని



శ్రీమహా చండీదేవి అవతారంలో ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారు

రామచంద్రపురం రూరల్: అష్టాదశ శక్తి పీఠాల్లో 12వ శక్తి పీఠంగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు గురువారం శ్రీమహా చండీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవావర్ణార్చన, సువర్ణ, రజత పుష్పార్చన చేశారు. శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఈ ఏర్పాట్లను ఆలయ ఈఓ పితాని తారకేశ్వర రావు పర్యవేక్షించారు.

కన్యకాపరమేశ్వరికి స్వర్ణ కిరీటం



అంబాజీపేటలో వాసవీమాతకు స్వర్ణకిరీటం అలంకరణ

అంబాజీపేట: స్థానిక బస్టాండ్ సమీపంలో వేంచేసి ఉన్న శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి శ్రీవాసవీ వైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం స్వర్ణ కిరీటాన్ని సమర్పించారు. రూ.24 లక్షల విలువైన నాలుగు వందల గ్రాముల బంగారంతో తయారు చేయించిన కిరీటాన్ని అమ్మవారికి అలంకరించారు. తొలుత ఈ కిరీటానికి సంప్రోక్షణ చేసి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

విజయదుర్గమ్మకు మకర తోరణం



మామిడికుదురులో విజయదుర్గమ్మకు అలంకరించిన వెండి మకర తోరణం

మామిడికుదురు: శ్రీదేవి శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా మామిడికుదురులోని విజయదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి భక్తుల విరాళాలతో వెండి మకరతోరణం చేయించారు. సుమారు రూ.4.25 లక్షల విలువైన ఐదు కిలోల వెండితో చేయించిన మకర తోరణానికి సంప్రోక్షణ అనంతరం అమ్మవారికి అలంకరించారు. ఈ మకర తోరణానికి పూజ్యం విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు చంద్రమౌళి భాస్కరం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

రావులపాలెం: ఏపీఎస్ ఆర్టీసీ రావులపాలెం డిపో నుంచి అరుణాచల గిరి ప్రదక్షిణ, తిరుమల శ్రీవారి దర్శనానికి నాలుగు రోజుల ప్రత్యేక యాత్ర బస్సు సర్వీసు నడుపుతున్నట్లు రావులపాలెం డిపో మేనేజర్ కేడీఎంఎస్ కుమార్ గురువారం తెలిపారు. సూపర్ లగ్జరీ బస్సు నవంబర్ 2న బయలు దేరి గిరి ప్రదక్షిణ అనంతరం 6న రావులపాలెం చేరుతుందన్నారు. టికెట్ ధర ఒక మనిషికి రూ.3,500గా నిర్ణయించామన్నారు. తిరుపతి, అరుణాచలం, కాంచీపురం, శ్రీపురం, కాణిపాకం, శ్రీకాళహస్తి, విజయవాడ మీదుగా యాత్ర ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు అసిస్టెంట్ మేనేజర్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఆకాంక్ష ఫలించే..

- వనామీకి వెన్నుదన్నుగా ప్రభుత్వం
- రైతు మోములో 'ధరహాసం
- రెండు నెలలుగా నిలకడగా ధరలు
- 100 కౌంట్‌కు రూ.240గా నిర్ధారించిన అప్సడా



అల్లవరం మండలం కొమరిగిరిపట్నంలో రొయ్యల చెరువు



వనామీ రొయ్యలు

సాక్షి అమలాపురం: ఆకాంక్ష ఫలించింది.. ఆక్వా రైతులకు ప్రభుత్వం కొండంత ఆసరాగా నిలిచింది.. మార్కెట్‌లో ధరల పెరుగుదలకు చర్యలు తీసుకోవడంతో రైతు మోములో దరహాసం వెల్లివిరిసింది.. వనామీ రొయ్యల సాగులో చాలా రోజుల తరువాత ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. ఎగుమతిదారులు సిండికేటుగా మారి ధరలు తగ్గిస్తున్న ప్రతిసారీ రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని ధరలు పెంచేలా చర్యలు తీసుకోవడం, గడిచిన రెండు మూడు నెలలుగా పెరిగిన ధర నిలకడగా ఉండడంతో ఆక్వా రైతులు ధైర్యంగా ముందుకు 'సాగు'తున్నారు.

జిల్లాలో వనామీ సాగు 12 వేల ఎకరాలకు పైగా జరుగుతోంది. సఖినేటిపల్లి నుంచి ఐ.పోలవరం మండలం వరకూ తీరాన్ని ఆనుకుని ఉన్న మండలాలతో పాటు అమలాపురం, ముమ్మిడివరం, కె.గంగవరం, రామచంద్రపురం, రాజోలు మండలాల్లో కూడా పెద్దఎత్తున సాగవుతోంది. కొన్నేళ్లుగా వనామీ రొయ్యల పట్టుబడి సమయంలో ధరలు పడిపోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ పరిస్థితిలో మార్పు తీసుకు వచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటోంది. కనీస మద్దతు ధర ప్రకటిస్తూ ఆ ధరలకు కొనుగోలు చేసేలా ఎగుమతిదారులను ఒత్తిడి చేస్తోంది. కరోనా నాటి నుంచి ఇప్పటి వరకూ పలు సందర్భాలలో ధరలు పతనమైన ప్రతిసారి ప్రభుత్వం జోక్యం చేసుకుంటోంది. రెండు నెలల కిందట ధరల పతనమైతే ప్రభుత్వం మరోసారి జోక్యం చేసుకుంది. అప్పటి నుంచి మార్కెట్ నిలకడిగా ఉంటోంది. రెండు నెలలుగా ధరలు నిలకడిగా ఉండడం రైతుల్లో సంతోషాన్ని నింపుతోంది. ప్రభుత్వం ఏపీ స్టేట్ ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా)ని ఏర్పాటు చేయడంతో ఆక్వా రైతుల సమస్యలు వేగంగా పరిష్కారమవుతున్నాయి.

నిర్ణయించి.. సహకరించి..

వనామీ కౌంట్ ధరలు ఆశాజనకంగా ఉన్నప్పటికీ తాజాగా ఆక్వా సాధికారత కమిటీ మరోసారి విజయవాడలో సమావేశమై ధరల విషయంపై చర్చించింది. ఈ సమావేశంలో వంద కౌంట్ వనామీ ధర రూ.240 ఉండాలని నిర్ణయించడం పట్ల ఆక్వా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇంతకన్నా తక్కువకు కొనడానికి వీల్లేదని ఆక్వా సాధికారత కమిటీ స్పష్టం చేసింది. ఇంతకన్నా తక్కువ ధరకు కొనుగోలు చేస్తే ఏపీ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) చట్టం ప్రకారం చర్యలు తప్పవని తేల్చింది. 100 కౌంట్ ధర రూ.240 వరకూ ఉంటే అంతకు తక్కువ కౌంట్ ధరలు సైతం పడిపోకుండా ఉంటాయనే భరోసా రైతులకు కలిగింది. ప్రస్తుతం వంద కౌంట్ ధరతో పాటు 50 కౌంట్ ధర రూ.320, 40 కౌంట్ ధర రూ.360, 30 కౌంట్ ధర రూ.410గా ఉంది.

ధరలు ఇలా..

వనామీ కౌంట్	ధరలు రూ.లో
30	410
40	360
50	320
60	295
70	275
80	260
90	250
100	240

రెండోసారి కూడా..

గడిచిన రెండు నెలలుగా వనామీ ధరలు ఆశాజనకంగా ఉండడంతో పాటు ధరలు పతనం కాకపోవడంతో రైతులకు సాగుపై నమ్మకం పెరిగింది. దీంతో రెండో పంట సాగుకు శ్రీకారం చుడుతున్నారు. సాధారణంగా గోదావరి జిల్లాలో రెండో పంట సాగు చేసేవారు సగం మంది కూడా ఉండరు. ఈసారి రైతులు ఎక్కువ మంది ఆక్వా సాగు చేస్తుండడం, మరికొంత మంది రైతులు సాగుకు సన్నాహాలు చేస్తుండడం విశేషం. ధరలు తగ్గడమే కాదు... ఎదురవుతున్న ఇబ్బందుల పరిష్కారంలో ప్రభుత్వం రైతు వెన్నంటే ఉంటోంది. కరోనాలో వనామీ ధరలు కనిష్ఠ స్థాయికి పడిపోయి వంద కౌంట్ ధర రూ.50కి చేరింది. ప్రభుత్వం జోక్యం చేసుకుని ఎగుమతులకు మినహాయింపులు ఇవ్వడంతో రైతులు తొందరగానే నష్టాల నుంచి కోలుకున్నారు. ఆక్వాకు యూనిట్‌కు రూ.1.50 చొప్పున ప్రభుత్వం రాయితీపై విద్యుత్ సరఫరా చేస్తోంది. జిల్లాలో సుమారు 4,608 విద్యుత్ కనెక్షన్‌లకు ఆక్వాకు ఇచ్చే రాయితీ అందిస్తోంది. విద్యుత్ ఉత్పత్తి యూనిట్‌కు రూ.6.70 ఖర్చవుతుండగా, ఆక్వా రైతుల కోసం ప్రభుత్వం రూ.5.20 భారాన్ని భరిస్తోంది.

అర్హులందరికీ రాయితీలు

జిల్లాలో ఈ-ఫిష్ సర్వేలో లోపాల వల్ల పలు కనెక్షన్‌లకు విద్యుత్ రాయితీ కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో అర్హులందరికీ రాయితీ విద్యుత్ అందుతోంది. గతంలో కన్నా రాయితీ సర్వీసుల సంఖ్య పెరగడం విశేషం. ఆక్వా రైతులకు నాణ్యమైన సీడ్, మేత అందించడంతో పాటు నీటి, భూ పరీక్షలు అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు ఆక్వా ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తోంది. జిల్లాలో ఇప్పటికే ముమ్మిడివరం, ద్రాక్షారామలో ఆక్వా ల్యాబ్‌లు సిద్ధమయ్యాయి. రాజోలులో నిర్మాణానికి చర్యలు ఊపందుకున్నాయి.

నిరంతర పర్యవేక్షణ ఉండాలి



వనామీ సాగు పెట్టుబడి గత ఐదేళ్ల కాలంలో రెట్టింపయ్యింది. కానీ ఆ స్థాయిలో ధరలు పెరగలేదు. ఒక్కోసారి మరీ ధరలు తగ్గిపోవడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నాం. ధరలు తగ్గుతున్న సమయంలో ప్రభుత్వం కలుగజేసుకోవడం అభినందనీయం. రొయ్యల ధరల మీదనే కాకుండా, మేతల ధరలు, విద్యుత్ రాయితీకి ఎదురవుతున్న సమస్యలపై నిరంతరం సమీక్ష ఉండాలి.

– నత్తి శ్రీనివాస్, ఆక్వా రైతు, సమనస, అమలాపురం మండలం

అమలాపురం ఆర్డీఓగా కేశవవర్ధన్‌రెడ్డి

సాక్షి, అమలాపురం: అమలాపురం ఆర్డీఓగా గందులూరి కేశవవర్ధన్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు వచ్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా డిప్యూటీ కలెక్టర్‌లు, ఆర్డీఓల బదిలీలు జరిగాయి. పలువురు ఆర్డీఓలకు డిప్యూటీ కలెక్టర్‌లుగా పదోన్నతి లభించింది. అమలాపురం ఆర్డీఓగా పనిచేసిన ఎస్‌వీబీఎస్ వసంతరాయుడు డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయనను జనరల్ అడ్మినిస్ట్రేషన్‌కు రిపోర్టు చేయాలని ఉత్తర్వులు వచ్చాయి.

రామచంద్రపురానికి సుధాసాగర్



సుధాసాగర్

రామచంద్రపురం: రామచంద్రపురం ఆర్డీఓగా జిల్లా సివిల్ సప్లయిస్ డీఎం ఎస్.సుధాసాగర్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం సుధాసాగర్ పౌరసరఫరాల శాఖలో ఇన్‌చార్జి డీఎంగా పనిచేస్తున్నారు. మండపేట నియోజకవర్గ ఎన్నికల అధికారిగా ఉన్నారు. ఇప్పటి వరకూ రామచంద్రపురం ఆర్డీఓగా పనిచేసిన పి.సింధూసుబ్రహ్మణ్యం సాధారణ పరిపాలన విభాగానికి బదిలీ అయ్యారు.

వకుళమాత భవనానికి విరాళాలు



దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వెంకన్న ఆలయంలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి విశాఖపట్నానికి చెందిన జి.ఉషారాణి రూ.50 వేలు, ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లికి చెందిన వ్యయ్యారి రామారావు రూ.25,020 విరాళం సమర్పించారు. ఈ విషయాన్ని ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు. దాతకు ఆలయ సిబ్బంది చేతుల మీదుగా స్వామివారి చిత్రపటం అందజేశారు.

బలహీన వర్గాల కోసమే 'జగనన్న చేదోడు'



జగనన్న చేదోడు నమూనా చెక్కు అందిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: బడుగు, బలహీన వర్గాల జీవనోపాధి పెంపొందించడానికే జగనన్న చేదోడు పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. గురువారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నుంచి ముఖ్యమంత్రి జగనన్న చేదోడు పథకం నాలుగో విడత నిధులను బటన్ నొక్కి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ శుక్లా, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావు పాల్గొని వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వయం ఉపాధి కోసం షాపులు నిర్వహిస్తున్న వెనుకబడిన తరగతుల ప్రజలకు ఏడాదికి రూ.10 వేలు ఆర్థిక సహాయంగా అందిస్తున్నామన్నారు. ఈ పథకం బీసీ కుటుంబాలకు సంజీవనిగా నిలుస్తోందన్నారు. దర్జీలు, రజకులు, నాయీ బ్రాహ్మణుల ఆర్థిక పురోభివృద్ధికి జగనన్న చేదోడు పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. మూడేళ్లుగా ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోందని, ఈ సొమ్ము లబ్ధిదారులకు ఆసరాగా నిలుస్తుందన్నారు. ఇంట్లోని ప్రత్యేక గదిలో టైలరింగ్ షాపు నిర్వహిస్తూ, రజక వృత్తి ప్రధాన జీవనాధారంగా ఉండి షాపు లేదా మొబైల్ లాండ్రీ ఉన్నవారు మాత్రమే అర్హులన్నారు. క్షౌర వృత్తి ప్రధాన జీవనాధారంగా ఉండి షాప్‌లు కలిగినవారిని అర్హులుగా గుర్తించామన్నారు. కోనసీమ జిల్లా వ్యాప్తంగా 11,028 మంది అర్హులకు రూ.11.03 కోట్ల మేర లబ్ధి చేకూరిందన్నారు. ఈ మేరకు నిధులు జమ చేశామని కలెక్టర్ వివరించారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ రాష్ట్ర సంక్షేమ చరిత్రలో చేదోడు పథకం ఒక సువర్ణ అధ్యాయమని అన్నారు. నవరత్నాలతో ప్రతి పేద కుటుంబానికి పథకాలు అందుతున్నాయన్నారు. ఇచ్చిన హామీ మేరకు ప్రతి పథకాన్ని అమలు చేసి ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వం దోహదపడుతుందన్నారు. ఇంకా లబ్ధి పొందలేని వారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పిస్తుందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, హితకారిణి సమాజం చైర్మన్ కాశీ బాల మునికుమారి, వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, బీసీ సంక్షేమ అధికారి ఎడ్లపల్లి సాంబమూర్తి, కమిషనర్ వీవీపీ నాయుడు, బీసీ కార్పొరేషన్ సీనియర్ అసిస్టెంట్ రమావతి తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరిపై భక్తుల రద్దీ

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయానికి గురువారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. సుమారు 40 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించినట్లు అధికారులు తెలిపారు. స్వామివారి దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం పట్టింది. స్వామివారి వ్రతాలు 1,600 జరిగాయి. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్త గోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద దీపాలు వెలిగించి పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం వచ్చింది. నాలుగు వేల మంది భక్తులకు అన్నదాన పథకంలో భోజనం పెట్టారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. రత్నగిరి సత్యదేవుని సన్నిధికి శుక్రవారం నుంచి ఐదు రోజుల పాటు వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. శుక్రవారం కనకదుర్గ అమ్మవారి జన్మ నక్షత్రం మూల నక్షత్రం కావడం, శని, ఆది, సోమ, మంగళ వారాలు దుర్గాష్టమి, మహర్నవమి, విజయదశమి తగులు, మిగులు సందర్భంగా వేల సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



సత్యదేవుని దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

మళ్లీ సీఎం జగనన్నే..



ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పినిపే విశ్వరూప్

మంత్రి పినిపే విశ్వరూప్


అల్లవరం: ఎన్నికల హామీలను 99 శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, మళ్లీ జగనన్నను సీఎంని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. అల్లవరం మండలం కోడూరుపాడులోని గుడ్డివానిచింత వద్ద సత్యకస్తూరి ఫంక్షన్ హాల్లో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా జగన్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని, నాణ్యమైన విద్యను పేదలకు అందిస్తున్నారన్నారు. పింఛన్ల సొమ్ము పెంపు, రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, డ్వాక్రా చెల్లెమ్మలకు రుణమాఫీ, సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ఏర్పాటు, 4 లక్షల శాశ్వత ఉద్యోగాలు, మహిళల భద్రతకు దిశా చట్టం, 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలు, ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా ఏపీని చేసేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు, ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నందున జగనే ముఖ్యమంత్రి కావాలని అని మంత్రి విశ్వరూప్ అన్నారు. నవంబర్ 1 నుంచి వలంటీర్ పరిధిలోకి 50 కుటుంబాల వద్దకు వెళ్లి ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం ద్వారా సీఎం జగన్ చేస్తున్న అభివృద్ధిని, అందించిన సంక్షేమాన్ని పార్టీ నాయకులతో కలసి వివరించాలని పిలుపునిచ్చారు. టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు ప్రజలను ఏ విధంగా మోసం చేశాడో తెలపాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఏ ఒక్క పథకం పూర్తి స్థాయిలో అమలు చేయలేదని మంత్రి అన్నారు. ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో సంక్షేమ పథకాలు అమలు కావాలంటే జగనే మళ్లీ మళ్లీ సీఎం కావాలని అన్నారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, గృహ సారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరికల శ్రీను, తుని నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెల్లుబోయిన శ్రీను, నాయకులు పినిపే శ్రీకాంత్, బీసీ, ఎస్సీ సెల్ అధ్యక్షులు యల్లమిల్లి బోసు, పరమట శ్రీను, ఉంద్రు బాబ్జి, చింతా రామకృష్ణ పాల్గొన్నారు.

కార్తికేయలో అవకతవకలపై రేపు విచారణ

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): కార్తికేయ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీలో జరిగిన ఆర్థిక అవకతవకలపై సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్ కోర్టులో శనివారం విచారణ జరుగుతుందని సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్ పి.దుర్గాప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సహకార చట్టం-51 ప్రకారం ఇప్పటికే విచారణ చేయగా రూ. 21.58 కోట్లు దుర్వినియోగమైనట్లు గుర్తించారు. దీనిపై సివిల్ కేసు నమోదయ్యిందన్నారు. పలువురు మాజీ డైరెక్టర్లపై పోలీసులు విచారణ చేపట్టారన్నారు. సొసైటీ మాజీ డైరెక్టర్ బాలం విజయకుమార్‌కు పలుమార్లు నోటీసులు పంపినా సమాధానం లేదన్నారు. నోటీసులు కూడా వెనక్కి వస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో సహకార శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు సహకారశాఖ డిప్యూటీ రిజిస్ట్రార్ కృష్ణశృతి డీసీసీబీ బ్యాంకులో సహకారశాఖ కోర్టులో విచారణ చేపట్టనున్నట్లు చెప్పారు. సహకార కోర్టులో విచారణకు హాజరుకావాలని డైరెక్టర్ నోటీసులు పంపినట్లు చెప్పారు.

ఉల్లిక్కిపాటే..

- అమాంతం పెరిగిన ధరలు
- బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.45
- లోకల్ పంట దెబ్బతినడమే కారణం



అమలాపురం టౌన్: కొండెక్కిన ఉల్లి ధర సామాన్యుల కంట నీరు రప్పిస్తోంది.. అమాంతం పెరగడంతో ఉలిక్కిపాటుకు గురిచేస్తోంది.. పది రోజుల కిందటి వరకూ జిల్లాలో కిలో ఉల్లిపాయలు రూ.20 నుంచి రూ.25 వరకూ ధర పలికేవి. ఈ ధర క్రమేపీ పెరుగుతూ ఇప్పుడు రూ.45కి చేరింది. దీంతో వినియోగదారులు విలవిల్లాడిపోతారు. జిల్లాకు ఏడాదిలో ప్రధానంగా రెండు దశలుగా రెండు ప్రాంతాల నుంచి ఉల్లిపాయలు దిగుమతి అవుతుంటాయి. ప్రస్తుతం కాలంలో కర్నూలు జిల్లా నుంచి ఉల్లి ఉత్పత్తుల (లోకల్ పంట) దిగుమతి జరుగుతోంది. ఆ జిల్లాలో పంట ఉత్పత్తి అయ్యే సరికి మహారాష్ట్ర రాష్ట్రం షోలాపూర్ నుంచి దిగుమతులు ఊపందుకోవడం ఆనవాయితీ. ఈ రెండు సీజన్లకు మధ్య బెంగళూరు నుంచి కొద్దిరోజుల పాటు ఉల్లిని దిగుమతి చేసుకుంటారు. అయితే ప్రస్తుతం లోకల్ పంటగా కర్నూలు జిల్లాలో ఉల్లి పంట దెబ్బతినడంతో ఇప్పుడు ఆ జిల్లా నుంచి పూర్తిగా కోనసీమకు దిగుమతులు ఆగిపోయాయి. ఇలా జిల్లాలోని కూరగాయల వ్యాపారులు మహారాష్ట్ర ఉల్లిపాయలను గత్యంతరం లేక దిగుమతి చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే రవాణా చార్జీలతో పాటు ఉల్లికి డిమాండ్ పెరగడంతో సహజంగా ధరలపై ప్రభావం పడింది. మహారాష్ట్ర నుంచి దిగుమతి చేసుకున్న ఉల్లి మాత్రమే జిల్లాలోని కూరగాయల దుకాణాల్లో లభ్యమవుతోంది. ప్రస్తుతం కిలో ధర రూ.45 పలుకుతున్నప్పటికీ మొదటి శ్రేణి రకం రూ.50 ధర ఉంటోంది. ఈ ధర కిలో ఒక్కంటికి మరో రూ.10 నుంచి రూ.15కి పెరిగే సూచనలు కనిపిస్తున్నాయని కూరగాయల వ్యాపారులు అంటున్నారు. వచ్చేది కార్తిక మాసం కావడంతో వన భోజనాల పేరుతో ఉల్లి వాడకం పెరిగి.. మాంసాహారం వినియోగం తగ్గనున్న కారణాలతో ఆ ధరపై మరింత ప్రభావం పడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. జిల్లాలో ఉన్న దాదాపు 650 కూరగాయల దుకాణాలకు హోల్‌సేల్ వ్యాపారుల ద్వారా రోజుకు సుమారు 150 టన్నుల వరకూ ఉల్లిపాయలు దిగుమతి అవుతున్నాయి.

శ్రీమహాలక్ష్మీ నమోస్తుతే



శ్రీమహాలక్ష్మీదేవిగా అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు

సామర్లకోట, అన్నవరం: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా సామర్లకోట పంచారామ క్షేత్రంలోని అమ్మవారు గురువారం మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అన్నవరం రత్నగిరి దుర్గామాతలు వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లను సిరులొసంగే శ్రీమహాలక్ష్మీదేవిగా అలంకరించి పూజించారు. ఒక చేతిలో అక్షయపాత్ర, మరో చేతిని అభయహస్తంగా చూపుతూ వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. పండితులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కనకదుర్గ అమ్మవారి జన్మనక్షత్రం మూల సందర్భంగా శుక్రవారం కనకదుర్గ, వనదుర్గ అమ్మవార్లకు చండీహోమం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

కళాస్ఫూర్తికి పట్టాభిషేకం

రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్లుగా అత్యున్నత అవార్డులను ప్రకటిస్తుంది. వివిధ రంగాల్లో నిష్ణాతులకు తగిన గుర్తింపు ఇస్తుంది. వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డుల ద్వారా వారికి సముచిత స్థానం కల్పిస్తోంది.. అదే విధంగా ఈ ఏడాది కూడా వివిధ రంగాల్లో లబ్ధప్రతిష్టులు 27 మంది ప్రముఖులను రాష్ట్ర కమిటీ ఎంపిక చేసింది. తమకు తాముగా దరఖాస్తు చేసుకున్న వారిని, జిల్లా కలెక్టర్లు, యంత్రాంగం కుణ్ణంగా పరిశీలించిన అనంతరం ఎంపిక చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదంతో కమిటీ అర్హులను ప్రకటించింది.

- వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డుకు ఎంపిక
- తూర్పుగోదావరి జిల్లా నుంచి రామబ్రహ్మం
- ఆర్ట్ అండ్ కల్చర్ విభాగంలో 'ఉప్పాడ'

పిఠాపురం: వస్త్ర రంగంలో కొత్తపల్లి మండలంలోని చేనేత కార్మికులు చరిత్ర సృష్టిస్తున్నారు. అగ్గి పెట్టిలో పట్టేటంత చీరను నేసిన ఘనత ఉన్న ఉప్పాడ జాంధానీ చీరలు తయారు చేసే కార్మికుల కళా నైపుణ్యానికి ప్రభుత్వం గుర్తింపు ఇచ్చింది. చేనేత ద్వారా రూపుదిద్దుకుంటున్న జాంధానీ చీరలు మహిళా లోకంలో మచ్చుతునకలుగా నిలుస్తూ అనతి కాలంలోనే అంతర్జాతీయ ఖ్యాతిని సంపాదించాయి. ఇప్పటి వరకూ పేటెంట్ హక్కుతో సహా పలు జాతీయ రాష్ట్ర అవార్డులు సొంతం చేసుకున్న ఉప్పాడ కాటన్, సిల్క్ కు మరో గుర్తింపు లభించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏటా ప్రతిష్టాత్మకంగా వివిధ రంగాల్లో కృషి చేసిన వారికి అందిస్తున్న వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ఆర్ట్ అండ్ కల్చర్ విభాగంలో కొత్తపల్లి మండలం ఉప్పాడ చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి విక్రయ సంఘం సొంతం చేసుకుంది. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఉప్పాడ జాంధానీ చీరల తయారీ కార్మికులతో 1938లో ఉప్పాడ చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి విక్రయ సంఘం ఏర్పాటు చేశారు. అప్పట్లో 300 మంది సభ్యులతో ఈ సంఘం ప్రారంభించారు. ప్రస్తుతం 200 మందితో కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఏటా కొత్త కొత్త డిజైన్లను పరిచయం చేస్తూ కార్మికులకు తోడ్పాటు ఇవ్వడంలో సంఘం ముఖ్య భూమిక పోషిస్తోంది. సంఘం ఆధ్వర్యంలో మగ్గాలపై జాంధానీ చీరలు తయారు చేస్తుండగా, సంవత్సరానికి రూ.14 లక్షల టర్నోవర్ కలిగి ఉంది. ఏ ప్రభుత్వంలోనూ ఇలా గుర్తించి అవార్డులు ఇవ్వలేదని సంఘం ఇన్‌చార్జి అధికారి కె.చేతస్ అన్నారు. ఎన్నో ఏళ్లుగా చేనేత కార్మికులకు అండగా నిలిచిన ఈ సంఘానికి ఇన్నాళ్లకు ప్రభుత్వ పరంగా గుర్తింపు లభించిందని సంఘం మేనేజర్ వెంకట సూర్యనారాయణ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ వచ్చాక నేతన్న నేస్తంతో నేత కార్మికులను ఆదుకోవడంతో చేనేత రంగం మరింత అభివృద్ధి సాధించిందని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఉప్పాడ చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి విక్రయ సంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి చర్యలు తీసుకుంటున్నామని, సంఘంలో సభ్యుల సంఖ్యను పెంచుతామన్నారు. ప్రస్తుతం వచ్చిన అవార్డు కార్మికులందరికీ చెందుతుందన్నారు. గతంలో పదుల సంఖ్యలో ఉండే మగ్గాలు ఇప్పుడు వందల సంఖ్యకు చేరుకున్నాయని, చీరల ఉత్పత్తి సైతం గణనీయంగా పెరిగిందన్నారు. సంఘం టర్నోవర్ పెంచడానికి కార్మికులను మరింత ఉత్సాహంగా పని చేయించడానికి ఈ అవార్డు ఉపయోగపడుతుందన్నారు.



ఉప్పాడ చేనేత సంఘంలో చీరలు విక్రయిస్తున్న సిబ్బంది

'భేతవోలు'కు పురస్కారం

నల్లజర్ల: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ 2023కి అవార్డులను గురువారం ప్రకటించారు. తెలుగు భాష- సాహిత్యం విభాగంలో తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లకు చెందిన ఆచార్య భేతవోలు రామబ్రహ్మం ఉన్నారు. సాహిత్య రంగానికి ఆయన అందిస్తున్న సేవలకు ఈ అవార్డు రావడంపై ఇక్కడి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భేతవోలు రామబ్రహ్మం అవధాన రాజ్యాంగ నిర్మాత. తెలుగు భాషకు ఆయన చేసిన విశేష సేవలకు గాను కేంద్రభాషా సమ్మాన్ పురస్కార్-2021కు ఆయన ఇటీవల ఎంపికయ్యారు. అలాగే 2018లో తెలుగు సాహిత్యానికి చేసిన సేవలకు గాను రాష్ట్రపతి ప్రశంసాపత్రం అందుకున్నారు. నల్లజర్లలో 1948 జూన్ 10న అతి సామాన్య కుటుంబంలో ఆయన జన్మించారు. కష్టాలే తోడుగా ఆయన ప్రాథమిక విద్యాభ్యాసం సాగింది. తర్వాత కొవ్వూరు సంస్కృత పాఠశాలలో భాషా ప్రవీణ చేశారు. ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు చదివారు. తర్వాత నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి ఆచార్య తూమాటి దోణప్ప పర్యవేక్షణలో తెలుగు వ్యాకరణాలపై సంస్కృత ప్రాకృత వ్యాకరణాల ప్రభావం అనే అంశంపై పీహెచ్‌డీ చేశారు. హైదరాబాద్‌లో వాఙ్మయి త్రైమాసిక పత్రికలో కొన్నాళ్లు పనిచేశారు. అదే పత్రికను బొమ్మూరుకు తీసుకువచ్చి పరిశోధనలో ప్రామాణికతను పాటిస్తూ తెలుగు సాహిత్యానికి విశిష్టమైన సంచికగా రూపొందించడంలో విశేష కృషి చేశారు. 2005లో హైదరాబాద్‌లో కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా చేరారు. అక్కడ రావూరి వెంకటేశ్వర్లు ప్రోత్సాహం, ప్రేరణతో భాషా ప్రవీణ చేశారు. 25 ఏళ్లలో 300 వరకూ అవధానాలు చేశారు. తర్వాత లెక్కలేనన్ని అవధానాలకు సంచాలకత్వం వహించారు. కొత్త గోదావరి వంటి పద్యకావ్యాలే కాకుండా నాటకాలు రాశారు. సాహిత్య వ్యాసాలు, పరిశోధనా గ్రంథాలు రాశారు. సంస్కృత నాటకాలకు వ్యాఖ్యానాలు రాసి ఎనలేని కీర్తి గడించారు. దేవీ భాగవతం వంటి రచన ద్వారా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందారు. ప్రస్తుతం ఆయన వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుకు ఎంపికయ్యారు.



ఆచార్య భేతవోలు రామబ్రహ్మం దంపతులతో సాహితీ అభిమానులు


ఇంటర్ ఫెయిల్ విద్యార్థులకు సువర్ణావకాశం

రాయవరం: ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు **పరీక్ష ఫీజు చెల్లించే** గడువును పొడిగించినట్లు **ఇంటర్** బోర్డు డీవీఈఓ **ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి** తెలిపారు. **ఈ మేరకు ఇంటర్** బోర్డు కార్యదర్శి **సౌరభ్‌గౌర్ నుంచి ఉ**త్తర్వులు వచ్చాయన్నారు. **వచ్చే** ఏడాది మార్చిలో **జరగనున్న పరీక్షలకు** హాజరయ్యే విద్యార్థులకు **పరీక్ష ఫీజు** గడువును నవంబరు **30వ తేదీ వరకూ** పొడిగించారన్నారు. ఇంటర్ ఫెయిలైన విద్యార్థులు, మధ్యలో కళాశాల మానివేసిన వారు, జనరల్, ఒకేషనల్ కోర్సులు చదివిన విద్యార్థులు జ్ఞానభూమి పోర్టల్ ద్వారా ఫీజు చెల్లించే అవకాశముందన్నారు. నిర్ణీత ఫీజుల మొత్తాన్ని చెల్లించి, పరీక్షలకు హాజరు కావాలన్నారు. ఫెయిలైన విద్యార్థి తిరిగి కళాశాలలో అడ్మిషన్ పొందిన అన్ని పరీక్షలకు హాజరైతే ఎక్కువ మార్కులు వచ్చిన దానిని పరిగణనలోకి తీసుకుంటామన్నారు. అలాగే కంపార్ట్‌మెంటల్, ఫెయిల్ అని కాకుండా ఒకేసారి ఉత్తీర్ణులైనట్లుగా సర్టిఫికెట్ జారీ చేస్తామన్నారు. అలాగే కళాశాలలో తిరిగి అడ్మిషన్ పొందిన విద్యార్థులకు జగనన్న అమ్మఒడి, ఇతర ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లలో ప్రవేశం పొందవచ్చన్నారు.



ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి

బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా పీకే రావు



పీకే రావు

అంబాజీపేట: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా అంబాజీపేటకు చెందిన పేరి కామేశ్వర రావు (పీకే రావు) నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జి.అనంత రాము నుంచి ఉత్తర్వులు అందుకున్నట్లు ఆయన గురువారం తెలిపారు. తనకు చైర్మన్ పదవి రావటంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబులకు రావు కృతజ్ఞతలు తెలిపారు.

కొబ్బరిచెక్కల వేలం ఖరారు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామికి మొక్కుబడిగా సమర్పించిన కొబ్బరి చెక్కలను సంవత్సరం పాటు తీసుకొనుటకు గురువారం దేవదాయ శాఖ అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. 2023 నవంబర్ 16 నుంచి నుంచి 2024 నవంబర్ 15 వరకు సంవత్సరం పాటు కొబ్బరి చెక్కలు తీసుకొనుటకు ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు పర్యవేక్షణలో బహిరంగ వేలం ఈ టెండర్ ప్రక్రియ ద్వారా నిర్వహించారు. టెండర్‌లో నలుగురు వ్యక్తులు వేయగా హెచ్చుపాటను కాకినాడ తిమ్మాపురం వాస్తవ్యుడు పోల్నాటి నాగ వెంకట రమణ రూ.44,55,000లకు హెచ్చు పాట దక్కించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాకర శ్రీనివాస్, గ్రామస్తులు ఉన్నారు.



కొబ్బరి చెక్కలకు వేలం నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

చికిత్స పొందుతూ ఖైదీ మృతి

కాకినాడ క్రైం: రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న ఓ ఖైదీ కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మరణించాడు. పోలీసుల వివరాల ప్రకారం కడియం మండలం మురమండ గ్రామానికి చెందిన గెల్లా బ్లెస్సింగ్ జాబ్‌బాబు(55) రాజమహేంద్రవరం టూ టౌన్ పీఎస్ పరిధిలో జరిగిన హత్య కేసులో నిందితుడు. 2002 నుంచి రాజమహేంద్రవరం కేంద్రకారాగారంలో శిక్ష అనుభవిస్తున్నాడు. గత నెల 28న అనారోగ్యంతో అతడు కాకినాడ జీజీహెచ్‌లో చేరాడు. చికిత్స పొందుతూ గురువారం మరణించాడు. సడన్ రెస్పిరేటరీ, కార్డియాక్ అరెస్టు వల్ల జాబ్‌బాబు చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. కాకినాడ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ముచ్చటగా మూడో స్థానం

- ఇన్‌స్పైర్ మనక్ ఆవిష్కరణలకు 4,168 నామినేషన్లు
- రాష్ట్రంలో ఉమ్మడి తూర్పుగోదావరికి గుర్తింపు



రాయవరం: విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక అంశాలపై ఆసక్తి పెంచి వారితో సరికొత్త ఆవిష్కరణలు రూపొందించేలా డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ వారు ఏటా ఇన్‌స్పైర్ మనక్ విజ్ఞాన మేళాను నిర్వహిస్తున్నారు. ఆవిష్కరణల రూపకల్పనకు ప్రభుత్వం విద్యార్థులకు ప్రోత్సాహకంగా నగదును అందిస్తూనే రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజేతలుగా నిలిచిన వారికి నగదు పారితోషికాలను అందజేస్తోంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల కోసం ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల నుంచి నామినేషన్లు ఆహ్వానించారు. ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి గరిష్ఠంగా మూడు, ఉన్నత పాఠశాలల నుంచి గరిష్ఠంగా ఐదు నామినేషన్ల చొప్పున ఆహ్వానించారు. జూన్ నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకూ విద్యార్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. ఉమ్మడి జిల్లాలోని 2,145 ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి 4,168 నామినేషన్లను ఆయా పాఠశాలల యాజమాన్యాలు ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేశారు. గత విద్యా సంవత్సరంలో 4,035 నామినేషన్లు రాగా, ఈ ఏడాది 133 నామినేషన్లు అధికంగా వచ్చాయి. ప్రాజెక్టుల రూపకల్పనలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాష్ట్ర వ్యాప్తంగా మూడో స్థానంలో నిలిచింది. గత విద్యా సంవత్సరంలో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలవడం గమనార్హం. పదేళ్లుగా మొదటి మూడు స్థానాల్లో ఏదో ఒక స్థానంలో నిలుస్తోంది.

ఎంపికైన ప్రాజెక్టుకు రూ.10 వేలు

జిల్లాలో 6-10 తరగతి చదువుతున్న ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులు నూతన ఆలోచనలతో సృజనాత్మక ఆవిష్కరణలు రూపొందించాలి. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఎంపిక చేసిన వినూత్న ఆలోచనలు కలిగిన ప్రాజెక్టుకు రూ.10 వేల నగదును విద్యార్థి ఖాతాలో జమ చేస్తారు. ప్రాజెక్టు తయారీ, జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్ ప్రదర్శనలో పాల్గొనేందుకు వీటిని ఖర్చు చేయాల్సి ఉంది. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించిన జిల్లా ఇన్‌స్పైర్ మనక్‌ను నవంబర్‌లో ఉమ్మడి జిల్లా కేంద్రం కాకినాడలో ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. గత విద్యా సంవత్సరానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 302 ప్రాజెక్టులు ఇన్‌స్పైర్ మనక్‌కు ఎంపికయ్యాయి. ఎంపికైన ప్రాజెక్టుల వివరాలను ఇప్పటికే ఆయా పాఠశాలలకు జిల్లా విద్యాశాఖ తెలియజేసింది. త్వరలో ఏర్పాటు చేసే జిల్లా స్థాయి మనక్‌లో ఎంపికైన ప్రాజెక్టులను విద్యార్థులు సిద్ధం చేసుకుని ప్రదర్శించాల్సి ఉంది.

ఇదే స్ఫూర్తి కొనసాగించాలి



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 368 ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి 1,626 నామినేషన్లు దాఖలు చేశారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల ఉపాధ్యాయులు ఇన్‌స్పైర్ మనక్ ఆవిష్కరణలకు మంచి స్పందన కనబర్చారు. నూతన ఆవిష్కరణలు రూపొందించేలా విద్యార్థులను ప్రోత్సహించారు. ఇదే స్ఫూర్తిని ముందు కొనసాగించాలి.

– జీవీవీఎస్ సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ అధికారి, అమలాపురం

త్వరలో ప్రదర్శనకు చర్యలు



ఇన్‌స్పైర్ మనక్ నామినేషన్ల విషయంలో జిల్లా రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో స్థానంలో నిలవడం సంతోషించదగ్గ విషయం. విద్యార్థులను ప్రోత్సహించిన ఉపాధ్యాయులకు అభినందనలు. త్వరలోనే 2022-23 జిల్లా ఇన్‌స్పైర్ ప్రదర్శనను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతాం. ఎప్పుడు చేసేదీ త్వరలో ఆయా పాఠశాలలకు తెలియజేస్తాం.

–జి.నాగమణి, ఆర్జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

క్షణికావేశం ప్రాణం తీసింది

కొత్తూరులో వ్యక్తి హత్య



హత్యకు గురైన గుత్తుల శ్రీను (ఫైల్)

కాకినాడ రూరల్: దొంగతనం మోపాడనే ఆవేశంతో చోటుచేసుకున్న వాగ్వావాదం ఒకరి నిండు ప్రాణాన్ని బలిగొంది. క్షణికావేశంతో సెంట్రింగ్ కర్రతో బలంగా తలపై కొట్టడంతో గణపవరం మండలం కొయ్యేరుకు చెందిన గుత్తుల శ్రీను (31) అక్కడికక్కడే మృతి చెందాడు. కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట పంచాయతీ రాయుడుపాలెం కొత్తూరు వద్ద గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి తిమ్మాపురం పోలీసుల కథనం ప్రకారం... గుత్తుల శ్రీను గతంలో అగర్వాల్ ఆయిల్ శుద్ధి కర్మాగారంలో వర్కర్‌గా పనిచేసేవాడు. అదే సమయంలో అక్కడ పనిచేస్తున్న పిఠాపురం మండలానికి చెందిన ఒక వివాహితతో పరిచయం ఏర్పడింది. దీంతో ఆ వివాహితతో శ్రీను కొత్తూరు వద్దకు వచ్చి అద్దె ఇంట్లో ఎనిమిది నెలలుగా నివాసం ఉంటున్నాడు. ఇదిలా ఉండగా వీరి వెనుక పోర్షన్‌లో డైలీ కూలీగా పని చేసుకునే ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన కోస మద్వీ ఉంటున్నాడు. శ్రీను తాపీ పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. వారికి చెందిన మిషన్ కుట్టుమెషీన్ హెడ్ మాయమవ్వడంతో వెనుక పోర్షన్‌లో ఉంటున్న మద్వీపై అనుమానం పెంచుకుని గురువారం నిలదీశాడు. ఇద్దరి మధ్య వాగ్వావాదం చోటు చేసుకుంది. ఒకరిని నొకరు తోసుకున్నారు. దీంతో మద్వీ అక్కడే ఉన్న సెంట్రింగ్ కర్రతో శ్రీను తలపై బలంగా మోదడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీనుతో సహజీవనం చేస్తున్న మహిళ ఫిర్యాదు మేరకు తిమ్మాపురం ఎస్సై షరీఫ్ కేసు నమోదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న రూరల్ సీఐ శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకుని హత్యకు గల కారణాలను విచారించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.

మొసలి కలకలం



చల్లపల్లిలో మొసలిని పట్టుకోవడానికి వలలు సిద్ధం చేస్తున్న సిబ్బంది

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి గ్రామ పంచాయతీ పరిధి వైరుపేటలోని ప్రధాన పంట కాలువలో మొసలి సంచరిస్తుందని స్థానికులు గురువారం గుర్తించారు. ఈ మేరకు అటవీశాఖ, ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమై దాన్ని పట్టుకోవడానికి సన్నాహాలు చేస్తున్నారు. వలలతో కాలువలో అడ్డకట్టలు వేసి మొసలిని బంధించేందుకు చర్యలు చేపట్టారు.

అమ్మవారికి వెండి గద సమర్పణ

కపిలేశ్వరపురం: అంగరలోని చేనేత సహకార సంఘం సమీపంలోని విజయదుర్గాంబిక వారికి గ్రామానికి చెందిన కుడకా గణపతి కుమారుడు శ్రీనివాస్, లక్ష్మీనారాయణమ్మ దంపతులు రూ.35 వేల విలువైన వెండి గదను సమర్పించారు. ఆలయ అర్చకులు కొలువుల మల్లికార్జునరావు అమ్మవారికి అలంకరించారు. దాతను ఆలయ నిర్వాహకులు అభినందించారు.